# ఎందుకీ కులం, కాల్చనా?

ఉదయం వచ్చిన వార్తాపత్రిక ప్రత్యక్షరం చదువుతూ వీధి అరుగు మీద కూర్చున్న తండ్రికి వినిపించేలా 'పాడు చదువులు–దండగ చదువులు...' అంటూ లోపలికి వెళ్ళిపోయాడు రామనరసింహం. కొడుకు మాటల్లో విసుగు, కోపం, అసహ్యం గూడు కట్టుకుని వుండడం ఆయన పసికట్టాడు. ఆ మాటలు బట్టే ఇంటర్వ్యూ ఫలితం ఇట్టే గ్రహించాడు మొన్ననే షష్టిపూర్తి చేసుకున్న తండ్రి శేషయ్య. అయినా కొడుకుని అడిగి తెలుసుకోవాలనుకున్నాడు. కుతూహలం కొద్దీ లోపలికి వెళ్ళబోయాడు. చదువుతున్న పత్రికను అరుగుమీద పడేసి లోపలినుంచి సంభాషణ ఘాటుగా వినిపించేసరికి ఆగిపోయాడు గుమ్మం దగ్గరే.

'చచ్చినా నేనింక ఏ ఇంటర్వ్యూకి వెళ్ళను. మిగిలి వున్న కాస్త మానాన్ని పోగొట్టుకోలేను..'

'అంత కోపం విసుగు పనికి రాదురా బాబూ'.

'ఇంట్లో కూర్చునే నీకేం తెలుస్తుంది నేను పడుతున్న అవమానం...దండగ చదువులు.'

'ఇంతకూ వెళ్ళిన యింటర్వ్యూ ఏమయింది..' తల్లి అమాయకంగా అడిగింది.

అప్రయత్నంగా తండ్రి చెవులు రిక్క పొడుచుకున్నాయి.

అడ్డమైనవాళ్ళకి సమాధానాలు చెప్పలేక చచ్చిపోతున్నా. అయునా ఆయన ప్రశ్నలూను. ఆయన వేసిన ప్రశ్నల్ని ఆయన్నే అడిగితే, బిక్క చచ్చిపోడు. దిక్కు మాలిన యీ తంతు జరిపించకపోతే యెవడేడ్చాడని... అంతా దొంగ సన్నాసులు...'

ఇంతకూ ఏమయిందిరా అని తల్లి మళ్ళీ అడక్కపోతే, కొడుకు మాటల జోరు యింకా సాగి వుండేదే. పేరుకి తగ్గట్టు అతను నరసింహావ

తారం దాలుస్తున్నాడు. ఆ తల్లికి అర్థమయిందల్లా అతని కోపతాపాలే. సహించలేకపోయింది.

'ఇంట్లో ఈగలు ముసురుకొనటం మీకు వినిపించటం లేదు... ఏ పల్లకీలో ఊరేగుతున్నారని ... మిమ్మల్నే' ...

ఆ సింహగర్జనకు ఆయన అదిరిపోయాడు. గుమ్మం దాటి లోపలికి అడుగుపెట్టాలని సాహసిస్తుంటే, గర్జారావం చెవుల తుప్పుని వదలగొట్టింది.

'ఒక్కగానొక్క కొడుకు యింతగా బాధ పడుతుంటే, అరుగుమీద కూలబడి పేపరు చదవాలని మీకెలా బుద్ధి పుడుతోందని... ప్రొద్దస్తమానం దేశం దేశమంటూ తిరిగిన ఆ తండ్రికి పుట్టిన మీరు మాత్రం యింటి విషయాలు పట్టించుకుంటారా ఏమిటి? ఆ దేశం మీకు కూడు పెట్టింది. ఇక మీ కొడుక్కి కూడ పెడుతుంది. ఏమిటో నా పిచ్చి కాకపోతే..'

'నువ్వా పిచ్చిదానివి... నీ సాధింపులతో అప్పుడు మా నాన్ననీ యిప్పుడు నన్నూ ఏడిపించుకు తింటున్నావు...' అంటూ తాచు తొక్కిన వాడిలా శేషయ్య లోపలికి వచ్చాడు. 'దేశం కాకపోతే మనకెవరే కూడు పెడుతున్నది! ఏ దేశాన్నయితే తిట్టి పోస్తున్నావో, ఆ దేశమే మనల్ని ఆదుకుంది యింతకాలం. లేకపోతేనా మనం కూడా కూటికీ గుడ్డకీ మొగం వాచి తిరిగేవాళ్ళం...' శేషయ్య కోపం తగ్గుముఖం పట్టడం లేదు. అంతకంతకూ పెరిగిపోతోంది.

అదృష్టవశాత్తూ భార్యగాని కొడుకుగాని నోరు మెదపక పోవడంతో, కొంతసేపటికి ఆయన యథాస్థితికి వచ్చాడు. ధర్మరాజని నలుగురు చెప్పుకునే తన తండ్రి రౌద్రాకారం దాలుస్తాడని కొడుకు ఎన్నడూ అనుకో లేదు. ఊహించలేదు కూడా. తండ్రిని చూస్తూ కూర్చుండిపోయాడు.

'ఎలాగూ నేను గయ్యాళి గంపనే. ఆపేరు ఎన్నడో వచ్చింది. మీతండ్రీ కొడుకులు మంచి వాళ్ళే. చివరికి నేనేగా చెడ్డదాన్ని...' గొణుక్కుంటూ వంటింట్లోకి వెళ్ళింది తల్లి.

'దుర్గమ్మగారూ'.... బయటి నుంచి పిలుపు.

'రండి పిన్నిగారు. అమ్మా పక్కింటి పిన్నిగారు వచ్చారు...' వంటింట్లోకి వినిపించేలా అన్నాడు కొడుకు.

శేషయ్య ముఖంలో బలవంతంగా తెచ్చుకున్న మందహాసం గోచరించింది.

'ఏం నాయనా, యింటర్వ్యూ బాగా చేశావా?'

వస్తూనే అడిగింది పక్కింటి పిన్నిగారు.

'అయిందనిపించారు' అన్నాడు రామనరసింహారావు ముక్తసరిగా.

'అంటే...'

'రిజల్టు రేపు తెలుస్తుంది...'

'శుభం.. నీక్కాకపోతే ఎవరికిస్తారయ్యా ఆ ఉద్యోగం...'

'నీ నోటి చలవ వల్ల మా వాడికి ఉద్యోగం వస్తే చాలు. అదే మాకు పదివేలు..' అంటూ తల్లి వచ్చింది. పిన్నిగారి పక్కన కూర్చుంది.

అంతవరకూ మూగనోము పట్టిన తండ్రి 'అయితే యివాళ రిజల్ట్ చెప్పలేదన్న మాట!' అన్నాడు. ఆయన మాటలో ఎంత ఆశాభావం!

'రిజల్ట్ యివాళే చెబుతామని చెప్పారు ఆ ఆఫీసువాళ్ళు. అందుకే యింతసేపూ అక్కడే కూర్చున్నా, మిగిలిన వాళ్లతో పాటు.'

'ఎందుకు చెప్పలేదో యేమిటో ...' అంటూ శేషయ్య వీధి వైపు నడవబోయాడు.

'అదే నాకూ ఆశ్చర్యంగా వుంది...'

'ఇందాక నీ వాలకం చూసి రిజల్ట్ చెప్పారనుకున్నా. నీ విసుగు, కోపం తగ్గిన తర్వాత మాట్లాడుదామని నువ్వు రాగానే మాట్లాడలేదు...' అంటూ శేషయ్య వీధి అరుగు చేరుకున్నాడు.

తల్లీ, ఆ పిన్నిగారూ లోకాభిరామాయణంలలో మునిగిపోయారు. కొడుకేమో తన గదికి వెళ్ళాడు.

మళ్లీ పత్రికా పఠనంలో నిమగ్నుడైనా శేషయ్య మనస్సు కొడుకు భవిష్యత్తు గురించి తలపోయసాగింది. తన తండ్రి అహోరాత్రం దేశం కోసం కలవరించినా, మామూలు కార్యకర్త కావడం వల్ల ఆయన గొప్పతనాన్ని నాయకులు సరిగ్గా అంచనా వేయలేకపోయారు. చెప్పుకో దగిన పదవులేమీ పొందకుండానే ఆయన 'హరీ' అన్నాడు. తాను? తండ్రి పేరు

చెప్పుకుని జీవితం సాగించాడు. అన్న వస్త్రాలకు లోటు లేదు. స్వగృహం కూడా ఏర్పడింది. మరి తన కొడుకు? శక్తివంచన లేకుండా చదివాడు. కృషికి తగినట్లుగా ఫలితం కూడా దక్కింది. న్యాయశాస్త్రంలో పట్టభద్రుడయ్యాడు. తండ్రిగా తాను చెప్పకూడదు కాని, వట్టి డిగ్రీల చదువు కాదు తన కొడుకుది. చదువుకున్న శాస్త్రంలోనే కాక, సాహిత్యం, సంగీతం, చిత్రలేఖనం మొదలైన వాటిలో కూడా ప్రావీణ్యం గడించాడు. నవరసాలూ ఒప్పిస్తూ నాటకాలలో ముఖ్యపాత్రలు ధరించి మంచిపేరు తెచ్చుకున్నాడు. ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. నాలుగైదు ఇంటర్వ్యూలకు వెళ్ళి వచ్చాడు. అతని బహుముఖ ప్రావీణ్యమే చివరికి బెడిసికొట్టింది. నీ కెందుకయ్యా యీ ఉద్యోగం, యింతకంటే మంచిదే వస్తుంది - అనే వాళ్ళు ఇంటర్వ్యూ చేసిన పెద్దలు. వాళ్ళ మాటలు విశ్వసించాడు. చివరికి మొండి చెయ్యి చూపారు. దాంతో రామనరసింహం నిరాశ చెందాడు. అందరినీ అసహ్యించుకోవడం ఆరంభించాడు. చివరికి ఆ చదువుల తల్లిని కూడా! ద్వేషం పెంచుకున్నాడు. అతని ప్రవర్తన చూసి మొదట్లో తండ్రి సానుభూతి ప్రకటించేవాడు. కాని ద్వేషభావం ఎక్కువయ్యే కొద్దీ సహించలేక పోయాడు. ఇప్పుడైతే భయపడుతున్నాడు. సాదురేగితే తలపొలమునగాని నిలవదంటారు. చివరికి కొడుకు పెంచుకుంటున్న ద్వేషం, అసహ్యం ఎక్కడికి వెళ్ళి నిలుస్తాయో! అతని ప్రవర్తన ఎలా పరిణమిస్తుందో! అదే శేషయ్యని పట్టి పీడించే భయం. అదే ఆయన్ని వేధించుకు తినే సందేహం! తన తండ్రి చాలా మందికి మాట సహాయం చేశాడు. కులం గిలం చూడకుండా చాలా మందికి ఉద్యోగాలు యిప్పించాడు, తెలిసిన పెద్దవాళ్ళకు చిత్తశుద్ధితో చెప్పి ఆయన మంచితనం, పరోపకార స్వభావం మనవడి పట్ల వాసన లేని పువ్వు లైనాయా?

ఇంటా బయటా విద్యుద్దీపాలు నవ్వులు ఒలకబోస్తున్నాయి. కాని శేషయ్య తలపు తీరులో ఆముదపుదీపం కూడా వెలగలేదు.

'నాన్నా, ఒంటరిగా కూర్చుని యిక్కడేం చేస్తున్నావు? అరుగుమీదే ఎంతసేపని కూర్చుంటావు? లోపలికి రావచ్చుగా...'

శేషయ్య ఉలిక్కిపడ్డాడు. బిత్తరపోతూ కొడుకుని తేరిపార చూశాడు.

'నాన్నా, తాతయ్యకు తెలిసినవాళ్లు చాలామంది వున్నారు... పెద్ద వాళ్లూ వున్నారు. వాళ్ళు తలచుకుంటే నాకు వుద్యోగం నిమిషంలో వచ్చేస్తుంది. నా విషయం వాళ్లకెవరికైనా చెప్పి చూడరాదు...'

'అబ్బాయి అలా ప్రాధేయపడి అడుగుతున్నా మీరు బెల్లంకొట్టిన రాయిలా వుంటారెందుకండీ....'

ఆశించిన ప్రత్యుత్తరం రాకపోయేసరికి, ఆ విసుగుని భర్తమీద చూపించింది, అడగందే అమ్మ కూడా పెట్టదు.

'అలాగా!'

'ఈ వెటకారాలకేం తక్కువలేదు...' భర్తమొండితనం ఆమె విసుగుని ద్విగుణీకృతం చేసింది.

'నీ కాళ్లమీద నువ్వు నిలబడాలని యిన్నాళ్లూ ఆశించాను. అలా నిలబడగలవని నా నమ్మకం. అందుకే మీ విషయం నే నెవ్వరితోనూ చెప్పలేదు..' ఆచి తూచి అన్నట్లుగా ఒక్కొక్కమాట అన్నాడు తండ్రి.

'ఇంతకాలం నేనూ ఆత్మవిశ్వాసంతోనే వున్నాను. ఇంటర్వ్యూలు చూసేకొద్దీ ఎందుకో గాని ఆ నమ్మకం సడలిపోతోంది...'

కొడు మాటలు వినగానే తండ్రికి వెంటనే మాట్లాడాలని తోచింది.

'పరిస్థితుల ప్రభావంవల్ల ఒక్కొక్కసారి నమ్మకం సడలిపోతుంది. మనం అనుకున్న విలువలు తారుమారు కావచ్చు. అయినా ఆత్మవిశ్వాసాన్ని మాత్రం వదులుకోకూడదు. ద్వేషభావం పెంచుకోకూడదు. మాటలు చెప్పడం సులభమని నాకూ తెలుసు...'

'బాబూ, నేనూ ఒకప్పుడు యువకుణ్ణే. ఆశలు ఫలించనప్పుడు నిరాశ కలగడం సహజం. కాని ఆత్మవిశ్వాసం అడుగంటిన తర్వాత మనమేమీ చెయ్యలేము. ఈ సంగతి మాత్రం గుర్తుంచుకో..నేను నీకు పెద్దగా సిరిసంపదలు యివ్వకపోయినా, పిరికిమందు మాత్రం పొయ్యలేదు.. అవునా....'

కొడుకు మౌనం వహించాడు.

'మాటల్లో పడితే మీకు భోజనం మాట కూడా గుర్తుకి రాదు. భోజనం చేసి తీరిగ్గా చెప్పుదురుగాని...' భార్య జోక్యం చేసుకుంది.

'అంటే, నా మాటలు ఎందుకూ పనికిరానివనేగా నీ వుద్దేశం!'

'అలా అని అన్నానా'?

'విడమరచి చెప్పాలా యేమిటి?'

'నేనేం చెప్పినా మీకు తప్పుగానే కనిపిస్తుందిలెండి.

'మధ్యాహ్నం కూడా ఏమీ తినలేదు...' నసిగాడు కొడుకు.

'మా నాయనే, ఎంత కష్టపడుతున్నావురా వుద్యోగం కోసమని ...ఆ మాట రాగానే చెప్పబోయినావుట్రా...ఉప్మా అయినా చేసిపెట్టేదాన్ని...' నొచ్చుకుంది తల్లి.

తండ్రి భోజనానికి లేవడంతో తల్లీ కొడుకులు వంటింట్లోకి నడిచారు.

వీధి తలుపు వెయ్యబోతుంటే యింటిముందు స్కూటరేదో ఆగిన చప్పుడయింది. వేస్తున్న తలుపు తీసి శేషయ్య వాకిట్లోకి వచ్చాడు.

స్కూటరునుంచి దిగిన వ్యక్తి సరాసరి తనవద్దకే వస్తుంటే ఆయన కొంచెం ఆశ్చర్యపోయాడు. నడివయస్సులో వున్నవాడు. ఎన్నడూ చూడలేదు. అపరిచితుడు.

'శేషయ్య గారిల్లు యిదేనా?'

'ఇదే...'

'మీరేనా శేషయ్యగారంటే...'

'అవునండి...'

వచ్చిన వ్యక్తి అరుగుమీద కూర్చుని యిల్లు అటూ యిటూ చూశాడు.

'మీ రెవరో చెప్పలేదు...' జంకుతూ అడిగాడు శేషయ్య.

'క్షమించాలి చెప్పనందుకు...'

ఫలానా కంపెనీ నుంచి వస్తున్నానని ఆయన చెప్పాడు. పోయిన ప్రాణంలేచి వచ్చినట్లనిపించింది శేషయ్యకి, ఇంటర్వ్యూ నిమిత్తం కొడుకు వెళ్లింది ఆ కంపెనీకే. 'ఒరేయ్ రాముూ. ఒక్కసారి యిలారా' అని కేక వేశాడు. ఆ కేకలో ఆదుర్దా, సంతోషం, సంశయం మిళితమై వున్నాయి.

కొడుకు వచ్చాడు. వస్తూనే ఆయన్ని చూసి ఆశ్చర్యపడుతూ, 'మీరు...' అన్నాడు.

'నేను హెడ్‌క్లార్క్‌గా పనిచేస్తున్నా...'

'నమస్కారమండి' వినయంగా చేతులు జోడించాడు రామనరసింహం.

'లేబరాఫీసర్ పోస్టు యింటర్వ్యూకి వచ్చారు గదా మీరివాళ...'

'అవునండి...'

ఎంతసేపటికి తండ్రీ కొడుకులు భోజనానికి రాకపోవడంతోవడ్డిస్తున్న ఆ చేతులతోనే తల్లి వీధి వాకిట్లోకి వచ్చి తలుపుచాటున నిలబడింది.

'నిన్నకూడా యింటర్వ్యూలు జరిగాయా?' అడిగాడు శేషయ్య సందేహిస్తూ.

'మూడురోజులుగా జరుగుతున్నాయండి... ఉండేది ఒక్కపోస్టు... ఎంత మంది వచ్చారనుకున్నారు. పాపం..'

'నిరుద్యోగ సమస్య అలా తీవ్రరూపం దాల్చింది కనకనే మన యువకులు నిరుత్సాహం నిస్పృహ చెందుతున్నారు' అన్నాడు శేషయ్య "ప్చ్" కొడుతూ.

'మా పెత్తండ్రిగారి అబ్బాయి కూడా ఆ పోస్టుకి అప్లై చేశాడండి. చదువుకి తగ్గ వుద్యోగం దొరకడంలేదు...'

అది వినగానే మబ్బుల్లోంచి బయటపడ్డ చంద్రబింబంలా కనిపించిన రామనరసింహం మనస్సులో యిరులు క్రమ్ముకున్నాయి. రోడ్డు రోలరు కిందపడిన కంకర్రాయి అయింది.

నిరుత్సాహం, నిరాశ తండ్రిని ఆవహించాయి.

'మీ తండ్రిగారు స్వాతంత్ర్య సమరయోధులనీ, అజాతశత్రువనీ విన్నాను' అన్నాడు వచ్చిన వ్యక్తి.

'అవునండీ. ఆయన చాలా దొడ్డమనిషి తనకోసమంటూ ఎవ్వరినీ ఆశ్రయించని మహనీయుడు.'

'ఆయన పేరు...'

'రామ నరసయ్యగారు...'

'మనవడిది తాతగారి పేరన్నమాట!'

'బారసాల రోజున ఆ పేరు పెట్టుకుని ఎంతగానో మురిసిపోయాను తాతగారిలా కాకపోయినా మనవడు కూడా అంత గొప్పవాడవుతాడని కలలు కన్నాను.'

తండ్రి గర్వపడడం చూసి కొడుకు లోలోన విసుక్కున్నాడు. ఎందుకీ పనికిమాలిన మాటలనుకుంది భార్య.

సందేహిస్తూ అడిగాడు శేషయ్య. 'ఇంతకూ మీరెందుకు వచ్చారో చెప్పనేలేదు.'

తల్లీ కొడుకులు చెవులు రిక్కపొడుచుకున్నారు.

'మీ అబ్బాయిగారి అప్లికేషన్ చూడగానే, మీ తండ్రిగారి పేరు మా అయ్యగారికి గుర్తుకొచ్చిందట. ఆ సంగతి నిర్ధారణ చేసుకోవాలని తోచిందట. అందుకోసం నన్నిక్కడికి పంపించారు...' ఆ వ్యక్తి వచ్చిన విషయం దాపరికం లేకుండా తెలియజేశాడు.

'మీ అయ్యగారెవరో నాకు తెలీదు. ఏ ప్రాంతం వారు?'

'ఏదో వెనకపడిన కులానికి చెందినట్టుగా చెపుతారు. చాలా మంచివారండీ...'

'మనిషికి మంచితనం కావాలిగానీండి, కులమెందుకండి కాల్చనా? కులం కంటె గుణం ముఖ్యమని మన పెద్దలు భావించినా, ఆచరణలో పెట్టలేకపోయారు. అందుకే మనదేశం యివాళ యిలా అఘోరిస్తుంది...'

శేషయ్య మాటలలోని భావావేశాన్ని వచ్చిన వ్యక్తి గుర్తించకపోలేదు.

'ఈ రూపంగానైనా తమను కలుసుకునే భాగ్యం కలిగినందుకు సంతోషిస్తున్నాను' అన్నాడు నవ్వుతూ.

'ఇంతకూ మీ అయ్యగారి పేరేమిటో చెప్పారు కాదు...'

'వివి రాఘవులు గారండీ...'

'రాఘవులుగారా!' ఆలోచిస్తూ అన్నాడు శేషయ్య.

చాలా చిన్నవారండీ... మహా వుంటే ముప్పైయేళ్లుండవచ్చు.

'ఆఫీసులో కలుసుకుంటే ఆయన ఏమైనా అనుకుంటారా?'

'క్షమించండీ చెప్పడం మరచిపోయాను. ఆయనగారి చదువుకి మీ తండ్రిగారు చాలా సహాయం చేశారట. పై వారం మీయింటికి వచ్చి మిమ్మల్ని కలుసుకుంటానని చెప్పమన్నారు.'

తండ్రి పరోపకార స్వభావం తలచుకుని శేషయ్య నిజంగానే గర్వపడ్డాడు.

'ఇక వెళ్లొస్తానండి...నా వల్ల మీ భోజనాలకు ఆలస్యమయింది..' అంటూ ఆయన శేషయ్యకు నమస్కరించాడు. 'మా ఆఫీసులోమీరు లేబరాఫీసరుగా వుద్యోగం చెయ్యాలని నా కోరిక. రామనరసింహంగారూ, మీకు కంగ్రాచులేషన్స్...' ఆయన స్కూటరు వద్దకు వెళ్ళాడు. రామనరసింహం ఆయన్ని సాగనంపాడు.

రామనరసింహం మనస్సులో ఆశలు చిగిర్చాయి, ఆకాశహర్మ్యాలు లేచాయి.,,కొడుకు ముఖంలో కొత్తకళరావడం చూసి తల్లి ఉప్పొంగిపోయింది. కొడుకు ఆఫీసరైనట్టుగా భావించి అతనివైపు సాదరంగా చూసింది.

ఏరా రామూ, యిప్పుడు చెప్పరా, చేసిన ఉపకారం మరచిపోని రాఘవులుగారు అడ్డమైనవాళ్లల్లోకి వస్తాడా? లేకపోతే మంచి వాళ్లల్లోకి వస్తాడా? కులం కులం అని చెప్పుకునే వాళ్లు చాలామంది కంటే వెనకపడిన కులానికి చెందిన రాఘవులుగారు నిజంగా వెనకబడిన కులానికి చెందినవాడా, లేకపోతే వెనకపడని కులానికి చెందినవాడా? తాతయ్య కాదురా మహనీయుడు. చేసిన మేలు చిన్నదైనా పెద్దదైనా మరచిపోని వాడేరా మహనీయుడు... ఏ కులస్థుడైనా అలాంటివాడు నాకు మహనీయుడుగానే సాక్షాత్కరిస్తాడు... నీకు వుద్యోగం యివ్వనీ యివ్వకపోనీ ...అది కాదురా ముఖ్యం గుణం కావాలి...' ఆవేశంతో చెప్పసాగాడు తండ్రి.

తల్లి కొడుకులు దిష్టిబొమ్మల్లా కనిపించారు.

పైవారం కోసం ఎదురుచూడసాగింది శేషయ్య మనస్సు.